క్లుప్తంగా

భద్రతా చర్యలపై మాక్ డ్రిల్



అగ్ని ప్రమాదాల నివారణపై మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

సామర్లకోట: విధి నిర్వహణలో ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాల సమయంలో చేపట్టాల్సిన చర్యలపై స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్‌లో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని అన్ని పరిశ్రమలల్లో కార్మికులు, ఉద్యోగులకు అవగాహన కల్పించాలన్న ఆదేశాల మేరకు రాక్ సిరామిక్స్‌లో ఈ మాక్ డ్రిల్ చేపట్టారు. ఉద్యోగులలో అప్రమత్తతను పెంపొందించడం, అత్యవసర పరిస్థితిలో ఉద్యోగులు, కార్మికులు ఎలా స్పందించాలో అగ్నిమాపక, ఫ్యాక్టరీ సిబ్బంది ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జీవీవీఎస్ నారాయణ, ఇన్‌స్పెక్టర్ రాంబాబు, సంస్థ ప్రతినిధులు టి.నిరాజ్‌కుమార్, రాజేందర్‌సింగ్ మాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి జయంతి



కొత్తపల్లిలో జరిగిన వంగవీటి జయంతిలో పాల్గొన్న నాయకులు

కొత్తపల్లి: పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి దివంగత వంగవీటి మోహనరంగా జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఊర చెరువు సెంటర్‌లోని వంగవీటి రంగా విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు మాట్లాడుతూ, రంగా ఒక కులం కోసం పోరాడిన వ్యక్తి కాదన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన వంగవీటిని కాపు సామాజిక వర్గానికి చెందిన వాడిగానే గుర్తిస్తున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, మత్స అప్పాజీ, సానా శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్

కాకినాడ సిటీ: ఏపీపీఎస్సీ గ్రూప్–2 సర్వీసెస్, ఏపీ కాలుష్య నియంత్రణ బోర్డులో అనలిస్ట్ గ్రేడ్–2 పోస్టులకు నియామకం కోసం సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం తాత్కాలికంగా అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 5వతేదీ ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి 2 గంటలు, 4.30 నుంచి 5.30 గంటల వరకు కాకినాడ జిల్లాలో సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీలో జరుగుతుందని డీఆర్వో వివరించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 8.30 నుంచి 9.15 గంటల వరకు, మధ్యాహ్నం 12 గంటల నుంచి 12.45 గంటల వరకు, 3.30 నుంచి 4.15 గంటల వరకు పరీక్షా కేంద్రం లోపలికి అనుమతిస్తారన్నారు.

సోషల్ ఆడిట్‌పై సమగ్ర తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్పీ సత్యనారాయణ

కరప: మండలంలో జరిగిన ఉపాధి పనులను సోషల్ ఆడిట్‌ను డీఆర్పీలు సమగ్రంగా తనిఖీ చేసి, నివేదికలు రూపొందించాలని స్టేట్ రీసోర్స్‌పర్సన్ సీహెచ్ఎన్ సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం సోషల్ ఆడిట్ బృందం, ఉపాధిహామీ పథకం సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 18వ విడత సామాజిక తనిఖీ జరుగుతోందన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో గతేడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు రూ.13.27 కోట్ల విలువైన 1,222 పనులు జరిగాయన్నారు. ఇందులో ఉపాధిహామీ పనులతో పాటు, పంచాయతీ రాజ్, సమగ్ర శిక్షా అభియాన్‌కు సంబంధించి వివిధ పనులు జరిగాయన్నారు. ఉపాధి వేతనాలుగా రూ.8,33,74,133, మెటీరియల్‌కు రూ.4,93,85,351 ఖర్చు చేశారన్నారు. ఆయా పనులతో పాటు, ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల తనిఖీ జరుగుతుందన్నారు. గ్రామాల వారీగా డీఆర్పీలు ఉపాధి పథకం నిధులతో చేసిన పనులు, పింఛన్ల పంపిణీని తనిఖీ చేస్తారన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, డీఆర్పీలు గ్రామాల వారీగా తుది నివేదికను రూపొందిస్తారన్నారు. అనంతరం మండల స్థాయిలో సామాజిక తనిఖీపై సమీక్ష జరుగుతుందని తెలిపారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు, ఏపీఓ వై.హేమమాధవి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు కష్ట కాలం

- వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించాలంటున్న పశు వైద్యులు
- ప్రాణాపాయానికి గురయ్యే అవకాశం
- ముందస్తు టీకాలు వేయించాలని సూచన



పశువుకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి

పిఠాపురం: ఊహించిన దానికంటే ఆలస్యంగా మొదలైంది వర్షాకాలం. ఇప్పటి వరకు ఎండలతో పచ్చి గడ్డి దొరక్క గడ్డుకాలాన్ని పశువులు ఎదుర్కొన్నాయి. ఇప్పుడు పడుతున్న వర్షాలతో ప్రాణం లేచి వచ్చినట్లుగా, కొత్తగా వచ్చే పచ్చని పసరును ఆవురావురంటూ తినేస్తాయి. ఇప్పటి వరకు మండిన ఎండలు, ఇప్పుడు కుండపోత వర్షాలు వెరసి పశువులకు రోగాలను తెచ్చిపెడతాయి. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోపోతే పశువులకు ప్రాణాపాయం తప్పకపోవచ్చు. తద్వారా రూ.లక్షల విలువైన పశువులు మృత్యువాత పడి, రైతులు తీవ్ర నష్టాలను చవి చూసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇప్పటివరకు ఎండలు మండుతుండడంతో.. పచ్చిక బయళ్లు మచ్చుకైనా కనిపించవు. చెరువులు, కాలువలు ఎండిపోతాయి. వర్షాలు ప్రారంభం కావడంతో కొత్త నీటితో చెరువులు, కాలువలు నిండి కళకళలాడతాయి. కొత్త పచ్చిక బయళ్లు పశువుల నోరూరిస్తాయి. దీంతో వాటిని తిన్న పశువులు అనుకోకుండా వ్యాధుల బారిన పడుతుంటాయి. రోగం తెలుసుకుని చికిత్స చేయించే లోపే ప్రాణం పోయే పరిస్థితులు నెలకొంటాయి. వాన జల్లులు, వీచే చలి గాలులు పశువులపై తీవ్ర ప్రభావం చూపుతాయి. సాధారణంగా కొత్త పచ్చిక, కొత్త నీరు, ముసిరే ఈగలు, దోమల వల్ల వర్షాలు ప్రారంభమైన రోజుల్లో పశువులకు గొంతు వాపు, జబ్బ వాపు, గాలి కుంటు, పొదుగు వాపు, జ్వరాలు, కుందేటి వెర్రి, వైరల్ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. వ్యాధులు ఆశించే కొద్దీ పాడి పశువుల్లో పాల సామర్థ్యం తగ్గిపోవడంతో పాటు, చనిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుందని పశు వైద్యాధికారులు చెబుతున్నారు.

వ్యాధుల సంక్రమణ ఇలా..

కొత్తగా వర్షాలు పడడం వల్ల కొత్తగా మొలిచిన గడ్డి తినడం, చెరువులు గుంతల్లో చేరిన నీరు తాగడం వల్ల పశువుల్లో ఎక్కువగా వ్యాధులు వ్యాపిస్తాయి. వీటిలో జబ్బవాపు వ్యాధి సోకడం వల్ల పశువుల జబ్బ వాయడం, జ్వరం అధికంగా రావడం, 24 గంటల్లో వైద్య సేవలు అందకపోతే కడుపు ఉబ్బి మరణం సంభవిస్తుంది. గొంతువాపు వ్యాధి ఎక్కువగా అన్ని వయసుల గేదెలకు వ్యాపిస్తుంది. గొంతు వాపుతో, అత్యధికంగా 106 నుంచి 107 వరకు జ్వరం వచ్చి, శ్వాస పీల్చుకోవడం కష్టమై, 12 గంటల్లో చనిపోయే అవకాశం ఉంది. గాలికుంటు వ్యాధి సోకితే, నోటిలో, కాళ్లల్లో కురుపులు ఏర్పడి, పశువులు మేత తినక క్షీణించి, పాల ఉత్పత్తి తగ్గిపోవడంతో పాటు, పెరుగుదల తగ్గిపోతుంది. గర్భంతో ఉన్న పశువులకు గర్భం కోల్పోవడం, చూలి కట్టే సమయంలో ఉన్న పశువులు చూలికట్టక పోవడం వంటివి జరుగుతాయి. జలగ తెగులు వర్షాలు పడినప్పుడు కొత్తగా వచ్చిన నీటి ద్వారా వ్యాపిస్తుంది. కొత్త నీటిని తాగిన పశువుల కడుపులోకి నీటి ద్వారా జలగలు ప్రవేశించి, పోషకాహార లోపాలను కలగజేస్తుంది. తద్వారా పశువులు పూర్తిగా నీరసిస్తాయి. పొదుగు వాపు వ్యాధి పశువుల శాలల్లో అపరిశుభ్ర వాతావరణం వల్ల వస్తుంది. పశువుల శాలలు వర్షాలు పడిన సమయాల్లో వాన జల్లులు పేడ, మూత్రంతో కలిసి, పరాన్న జీవులు పెరిగి, వ్యాధులు వ్యాపిస్తాయి.

టీకాలు వేయించాలి

ప్రతి రైతు తమ పశువులకు వ్యాధులు వచ్చాక వైద్యం చేయించడం కంటే, నివారణకు వెంటనే టీకాలు వేయించాలి. ప్రతి రైతు తమ సమీపంలో పశు వైద్యశాలలను సంప్రదించాలి. తద్వారా సిబ్బంది అన్ని వివరాలు తెలియజేసి, సహకారం అందిస్తారు.

– ప్రశాంత్, పశు వైద్యాధికారి, గొల్లప్రోలు

నియోజకవర్గంలో పశువుల వివరాలిలా..

గేదెలు - 17,720
ఆవులు - 8,465
మేకలు - 19,890
గొర్రెలు - 16,843

వ్యాధులు రాకుండా జాగ్రత్తలు

ప్రస్తుతం పడిన వర్షాల ప్రభావం పశువులపై ఎక్కువగానే ఉంటుంది. ఇక నుంచి వర్షాలు ఎక్కువగా వచ్చే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తుండడంతో, రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. వర్షాలు పడితే ప్రారంభమయ్యే గొంతు వాపు, జబ్బ వాపు, గాలికుంటు, పొదుగు వాపు, జ్వరాలు, కుందేటి వెర్రి, వైరల్ ఇన్‌ఫెక్షన్లు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- వ్యాధులు రాకుండా పశు సంవర్ధక శాఖ ద్వారా టీకాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. రైతులు వాటిని తమ పశువులకు ముందుగా వేయించుకోవడం ద్వారా వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చు.
- పశువులు గుంతలు, చెరువుల్లో కలుషిత నీరు, నిల్వ ఉన్న నీటిలో కలిసిన కొత్త నీరు తాగకుండా జాగ్రత్తలు పాటించాలి.
- వర్షం పడిన సమయంలో పశువుల శాలలను పొడిగా ఉండేలా చూసుకోవాలి.
- ఈగలు, దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలి.
- బూటాక్స్ వంటి మందులను లీటరు నీటిలో ఐదు మి.లీ. మందును కలిపి, పశువులు, పశుశాలల్లో పూర్తిగా తడిసేలా పిచికారీ చేయాలి.

ఉపాధి శ్రామికులతో ర్యాలీ



కొత్తపల్లిలో ఉపాధి శ్రామికులతో జరిగిన సమావేశం

కొత్తపల్లి: మన ఊరు–పనితీరు, పారదర్శక బోర్డుల ఏర్పాటు కార్యక్రమాన్ని గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ఎస్ఆర్పీ, డీఆర్పీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధి శ్రామికులతో ర్యాలీ నిర్వహించారు. మౌలిక సదుపాయాలు, విద్య, కమ్యునికేషన్, లక్ష్యాలు, ప్రయోజనాలు, నూతన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉపాధిహామీ ఏపీఓ కొండలరావు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ పని కల్పించే బాధ్యత అధికారులపై ఉందన్నారు.

మద్యం మత్తులో కత్తితో దాడి

వ్యక్తికి తీవ్ర గాయాలు

పిఠాపురం: గొల్లప్రోలు శివారు జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి మద్యం మత్తులో ముగ్గురి మధ్య జరిగిన గొడవలో.. ఇద్దరు కలిసి ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేశారు. దీంతో అతనికి తీవ్ర గాయాలైనట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, గొల్లప్రోలు మండలం బి.ప్రత్తిపాడుకు చెందిన ఊట ఇంద్ర, గొల్లప్రోలుకు చెందిన జ్యోతుల రాము, అదే గ్రామానికి చెందిన అనిశెట్టి వంశీ మధ్య మనస్పర్థలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఇంద్ర, రాము మోటారు సైకిల్‌పై గొల్లప్రోలు జాతీయ రహదారిపై వెళుతుండగా, తాటిపర్తి జంక్షన్ వద్ద వంశీ ఎదురుపడ్డాడు. పాత గొడవల నేపథ్యంలో ముగ్గురూ వివాదానికి దిగారు. దీంతో వంశీని ఇంద్ర, రాము కత్తితో పొడిచారు. గాయాలపాలైన వంశీని స్థానికులు పిఠాపురంలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతున్నాడు. ఎస్సై ఎస్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా వారాహీ అమ్మవారి నవరాత్ర మహోత్సవాలు



కుంకుమ పూజకు హాజరైన వంగా గీత

కొత్తపల్లి: మండలంలోని రమణక్కపేటలో మేడిబోయిన సత్యగౌరీ ఆధ్వర్యంలో వారాహీ అమ్మవారి నవరాత్ర మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం చండీయాగం, కుంకుమ పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమెకు వేద పండితులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వంగా గీత మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కారే శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, నాయకులు కాదులూరి నేరెళ్ల రెడ్డి, జ్యోతుల బాబులు, యరకం ప్రసాద్‌రెడ్డి, అనిశెట్టి లోవ, మాజీ సర్పంచులు మేరుగు ఆనందరావు, కాళ్ల గోవింద్, వడ్డి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు ఆషాఢం సారె



గాజుల అలంకారంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారికి సారె తీసుకువస్తున్న గ్రామస్తులు

పిఠాపురం: ఆషాఢ మాసం శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని జములపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న కనకదుర్గ అమ్మవారికి గ్రామ ప్రజలు సారెను సమర్పించారు. ముందుగా కనకదుర్గ అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించి, అమ్మవారికి సారెను సమర్పించారు. పెద్దఎత్తున మహిళలు పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమ పూజలు

పిఠాపురం: నూతనంగా నిర్మించిన స్థానిక చింతావారి వీధిలోని మహాలక్ష్మి గణపతి సహిత సీతా రామాంజనేయ ఆలయంలో ఆషాఢ మాసం శుక్రవారం సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వారాహీ అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిగాయి. పలువురు మహిళలు పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు →

ధన ప్రజాస్వామ్యంలో బతుకుతున్నాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మధు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

పెద్దాపురం: అతి పెద్ద ప్రజాస్వామ్య, లౌకిక వ్యవస్థలన్నీ కాగితాలకే పరిమితమయ్యాయని, నేడు ధన ప్రజాస్వామ్యంలో బతుకుతున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ 18వ పట్టణ మహాసభ శుక్రవారం హమాలీ యూనియన్ కార్యాలయంలో సంఘ నాయకుడు వై.రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ము కాస్తున్న పాలకులు.. ప్రజల నెత్తిన భారాలు మోపుతున్నారని మండిపడ్డారు. చింతపల్లి, నర్సీపట్నం, విశాఖ మన్యం ప్రాంతాల్లో అమాయక గిరిజనులను దోచుకుంటున్న ఆంగ్లేయుల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడిన అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ మాట్లాడుతూ, విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని శనివారం చేపట్టే సీపీఐ రాష్ట్రవ్యాప్త నిరసనలను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సత్యనారాయణ మాట్లాడుతూ, ఈ నెల 16, 17 తేదీల్లో సామర్లకోటలో నిర్వహించే కాకినాడ జిల్లా మహాసభలను అన్ని వర్గాల ప్రజలు విజయవంతం చేయాలన్నారు. తొలుత అల్లూరి జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శిగా వై.రామకృష్ణతో పాటు, మరో ఏడుగురిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ నాయకులు త్రిమూర్తులు, శ్రీను, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో సైక్లింగ్ క్లబ్ ప్రారంభం



సూర్యారావుపేట బీచ్‌లో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న నార్సింగ్ సైలాని

కాకినాడ రూరల్: సూర్యారావుపేట బీచ్‌లో ఎన్‌సీసీ సైక్లింగ్ క్లబ్‌ను ఎన్‌సీసీ ఆంధ్రా, తెలంగాణ డైరెక్టరేట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ నార్సింగ్ సైలాని శుక్రవారం ప్రారంభించారు. ఎన్‌సీసీ కేడట్లతో ఆయన సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నార్సింగ్ సైలాని మాట్లాడుతూ, శారీరక ఫిట్‌నెస్‌ను, దృఢత్వాన్ని పెంచడానికి సైక్లింగ్ సాధారణమైన, శక్తివంతమైన మార్గమన్నారు. అనంతరం కాకినాడ గ్రూప్ హెడ్ క్వార్టర్స్‌ను సందర్శించారు. గ్రూప్ కమాండర్ కల్నల్ ఆర్ఎం అరర్వాల్ స్వాగతం పలికారు.

గోదావరి కాలువలో తూటికాడ తొలగింపు



గోదావరి కాలువలో తూటికాడను తొలగిస్తున్న సిబ్బంది

సామర్లకోట: ఎట్టకేలకు గోదావరి కాలువలో తూటికాడ తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గోదావరి కాలువలో పెరిగిపోయిన గుర్రపు డెక్క అనే శీర్షికతో గత నెల 20న సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. గత నెల 15వ తేదీన గోదావరి కాలువకు నీరు వచ్చినప్పటి నుంచి గుర్రపు డెక్క, తూటికాడ పెరిగి.. పంట కాలువలకు నీరందని పరిస్థితి ఏర్పడింది. దాంతో కథనం ప్రచురితం కావడంతో హుస్సేన్‌పురం నుంచి ఉన్న తూటి కాడను కిందకు తోసేశారు. నీటి ప్రవాహంలో మాండవ్య నారాయణస్వామి ఆలయం సమీపంలో కాలిబాట వంతెన వద్ద తూటికాడ చిక్కుకుపోవడంతో దానిని తొలగించారు. ఐదు తూముల వద్ద పొక్లెయిన్‌ను ఏర్పాటు చేసి, తూటికాడను గోదావరి కాలువ నుంచి తొలగిస్తామని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. గోదావరి కాలువ మూసివేసిన సమయంలో, కాలువలో ఉన్న తూటికాడ, గుర్రపు డెక్కకు సంబంధించిన దుంపను తొలగిస్తే తరుచూ ఈ సమస్య ఉండదని పలువురు చర్చించుకుంటున్నారు. పంట సాగు సమయంలో తూటికాడ, గుర్రపుడెక్క తొలగింపు ప్రక్రియ ప్రారంభం కావడంతో, పంట కాలువల ద్వారా సాగు నీరు వచ్చే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

అల్లూరి ఆశయ సాధనకు కృషి



వరహాలయ్యపేటలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



ఆనూరులో అల్లూరి విగ్రహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న రైతు కూలీలు



సామర్లకోటలో అల్లూరి విగ్రహానికి డీవైఎఫ్ఐ, సీపీఎం నాయకుల నివాళులు

- జయంతి వేడుకల్లో వక్తల పిలుపు

పెద్దాపురం: బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమాలు శుక్రవారం పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. అల్లూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెద్దాపురం ఆర్డీవో కె.శ్రీరమణి అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో సిబ్బందితో కలిసి అల్లూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఆర్డీవో మాట్లాడుతూ, విప్లవ పోరాటాలతో అల్లూరి పేద ప్రజలకు ఎంతో మేలు చేకూర్చారన్నారు. డీటీ భానుకుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక వరహాయలయ్యపేటలో అల్లూరి విగ్రహానికి సీపీఎం మహిళా నాయకురాలు రొంగల సుబ్బలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకుడు సిరిపురపు శ్రీనివాస్ మాట్లాడుతూ, అల్లూరి పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశ సార్వభౌమాధికారాన్ని అల్లూరి కాపాడితే, బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమెరికా ముందు తాకట్టు పెట్టిందన్నారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి డి.క్రాంతికుమార్, సత్యనారాయణ, కృష్ణ, రాంబాబు, గడిగట్ల సత్తిబాబు, బంగ్రాజు, గూనురి రమణ తదితరులు పాల్గొన్నారు. ఆనూరు గ్రామంలో ఏపీ రైతుకూలీ సంఘం, ఏఐఎఫ్‌టీయూ సంయుక్తాధ్వర్యంలో అల్లూరి జయంతి నిర్వహించారు, సంఘ జిల్లా అధ్యక్షుడు కుంచే అంజిబాబు మాట్లాడుతూ, అల్లూరి పోరాట స్ఫూర్తితో ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తొలుత అల్లూరి విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కడితి సతీష్, పైడిమళ్ల నాగరాజు, రైతు కూలీలు పాల్గొన్నారు.

ఆదర్శంగా తీసుకోవాలి

సామర్లకోట: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు సీపీఎం, డీవైఎఫ్ఐ నాయకులు ఘన నివాళులర్పించారు. స్థానిక బళ్ల మార్కెట్ సెంటర్‌లోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేశారు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అల్లూరి జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు అన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. డీవైఎఫ్ఐ అధ్యక్షుడు సైఫ్‌రెడ్డి యువరాజు అధ్యక్షత వహించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు బాలం శ్రీనివాసు, డీవైఎఫ్ఐ నాయకులు తుంపాల శ్రీనివాసు, బాలం హరి, సీహెచ్ మహేష్, బాలం సత్తిబాబు, సానిపిని హరి తదితరులు పాల్గొన్నారు.

గోదావరి కాలువ గట్టు పరిశీలన

- మరోసారి సర్వే చేయాలన్న తహసీల్దార్



తవ్వకం జరిపిన గోదావరి కాలువ గట్టును పరిశీలిస్తున్న తహసీల్దార్

సామర్లకోట: అక్రమ తవ్వకాలు జరిపారనే ఫిర్యాదుల మేరకు స్థానిక మాండవ్య నారాయణ స్వామి ఆలయం సమీపంలోని గోదావరి కాలువ గట్టును తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి శుక్రవారం పరిశీలించారు. గట్టు సగభాగం తవ్వి ఉండటంతో ఆయన విస్తుపోయారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రెవెన్యూ శాఖకు చెందిన సర్వేయర్ చేసిన సర్వే ఆధారంగానే గట్టుపై మక్కులు వేయడంతో, భూమి కలిగిన వ్యక్తి గట్టును తవ్వకం చేసినట్లు ఇరిగేషన్ అధికారి తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. దాంతో సర్వేయర్‌తో ఫోన్‌లో మాట్లాడి, ఇరిగేషన్ గట్టుపై మరోసారి సర్వే చేసి, ఫిర్యాదు చేసిన రైతుల అభ్యంతరాలను పరిష్కరించాలన్నారు. గోదావరి కాలువకు వరదలు వస్తే గట్టు కోతకు గురయ్యే అవకాశం ఉందని తహసీల్దార్ తెలిపారు. గోదావరి కాలువ గట్టుపై విద్యుత్ స్తంభాల వరకు గట్టును తవ్వి ఉండడాన్ని గమనించారు. ఈదురు గాలులు వేస్తే విద్యుత్ స్తంభాలు కూలిపోయే అవకాశం ఉందన్నారు. గట్టు పరిస్థితిపై తహసీల్దార్ తన సెల్‌ఫోన్‌లో వీడియో తీశారు. గట్టును పరిరక్షించాలని గత నెల 25న రైతు బిక్కిన శ్రీరంగనాయకులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కాగా వీకే రాయపురం నుంచి సామర్లకోటలోని మాండవ్య నారాయణస్వామి ఆలయం వరకున్న చెరువు గట్టుపై కొబ్బరి మొక్కల నుంచి ఫలసాయం పొందడానికి, గడ్డి కోసుకోవడానికి చెట్టు–పట్టా పథకంలో ఫీల్డు లేబర్ కో–ఆపరేటివ్ సొసైటీకి ఇచ్చారని, అటువంటి గట్టుపై చెట్లను తొలగించడంతో పాటు, తమ జీవనోపాధికి అన్యాయం చేశారని సంఘ గౌరవాధ్యక్షుడు నేతల హరిబాబుతో కలిసి, సభ్యులు ఇటీవల డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసుకు ఫిర్యాదు చేశారు. ఆయా ఫిర్యాదుల ఆధారంగా గట్టును తహసీల్దార్ శుక్రవారం పరిశీలించి, ఇరిగేషన్ అధికారుల సమక్షంలో మరోసారి సర్వే చేస్తారని చెప్పారు. ప్రస్తుతం గట్టు తవ్వకం చేసిన ప్రదేశంలో గోదావరి కాలువకు గండి పడితే, వేలాది ఎకరాలలో పంటలు ముంపునకు గురవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.